సామాన్యుడి గొంతుగా.. సామాజిక సమర వేదికగా..

# మన చౌరాస్తా

The Complete News way

మన చౌరాస్తా Telugu News Channel

సంపుటి : 02 | సంచిక : 65 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | బుధవారం | 25.06.2025

## రైతును రాజు చేయడమే మా లక్ష్యం

- రైతు నేస్తం సభలో సీఎం రేవంత్ రెడ్డి వెల్లడి

2 లో

- వ్యవసాయాన్ని పండగ చేసి చూపిస్తున్నాం..
- 9 రోజుల్లో రూ.9 వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ
- కేసీఆర్ ఎగ్గొట్టిన రూ.7 వేల కోట్లను కూడా ఇచ్చాం
- బనకచర్లకు తలూపిందే కేసీఆర్...
- దీనిపై అసెంబ్లీలో చర్చకు రావాలి





## పల్లాను పరామర్శించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి

**జనగామ, మన చౌరాస్తా :** ఇటీవల ప్రమాదవశాత్తు గాయపడిన జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డిని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మంగళవారం పరామర్శించారు. హాస్పిటల్‌లో చికిత్స పొంది హైదరాబాద్ లోని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటుండగా పల్లాను ఎర్రబెల్లి పరామర్శించి ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

wanted

విలేకరులు కావలెను

మన చౌరాస్తా తెలుగు దినపత్రిక స్థాపించిన అనతి కాలంలోనే పాఠకుల విశేష ఆదరణ పొందుతూ డిజిటల్ మీడియా రంగంలో దూసుకెళ్తోంది. స్థానిక సమస్యలపై, రాజకీయ, ఎడ్యుకేషన్, ఆరోగ్యం, సినిమా వార్తలు అందిస్తూ అందరి మన్ననలు పొందుతూ ముందుకు సాగుతోంది. మా పత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్లు కావలెను.. పూర్తి వివరాలకు ఈ కింది నంబర్లలో సప్రదించగలరు.

manachourasta@gmail.com

8555800812 9676400812

సామాన్యుడి గొంతుగా.. సామాజిక సమర వేదికగా..

మన చౌరాస్తా

The Complete News way





# రైతును రాజు చేయడమే మా లక్ష్యం

- వ్యవసాయాన్ని పండగ చేసి చూపిస్తున్నాం..
- 9 రోజుల్లో రూ.9 వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ
- కేసీఆర్ ఎగ్గొట్టిన రూ.7 వేల కోట్లను కూడా ఇచ్చాం
- బనకచర్లకు తలూపిందే కేసీఆర్...
- దీనిపై అసెంబ్లీలో చర్చకు రావాలి
- రైతు నేస్తం సభలో సీఎం రేవంత్ రెడ్డి




**హైదరాబాద్, మన చౌరాస్తా :**

రైతు భరోసా కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేశామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. వ్యవసాయం అంటే.. రైతును రాజును చేయడం అని తెలుసన్నారు. రైతులకు అండగా నిలిచి, వారికి చేదోడువాదోడుగా కార్యక్రమాలు చేస్తున్నామని అన్నారు. వ్యవసాయాన్ని దండగ అనే స్థాయి నుంచి పండగ చేసేందుకే వైఎస్ఆర్ ఆనాడు ఉచిత విద్యుత్ అందించారని చెప్పారు. రైతుల ఆశీర్వాదం వల్లనే చిన్న వయస్సులో సీఎం అయ్యానని, రైతాంగం అభివృద్ధికి సాయశక్తులా కృషి చేస్తానని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రైతు భరోసా నిధుల పంపిణీ కార్యక్రమం మంగళవారంతో పూర్తయింది. 9 రోజుల్లో రూ.9 వేలకోట్ల మొత్తాన్ని రైతుల ఖాతాల్లో జమ చేశారు. రైతు భరోసా కార్యక్రమం విజయవంతంగా పూర్తయిన సందర్భంగా సచివాలయం ఎదురుగా రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద 'రైతు నేస్తం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడారు. కేసీఆర్ ఎగ్గొట్టిన రూ. 7 వేల కోట్ల రైతు భరోసా తమ ప్రభుత్వం ఇచ్చిందని అన్నారు. 70 లక్షల మంది రైతుల కళ్ళల్లో సంతోషం చూస్తున్నామని.. రైతుభరోసా కోసం 9 రోజుల్లో రూ. 9 వేల కోట్లు నిధులు రిలీజ్ చేయడం రికార్డ్ అని అన్నారు. 70 లక్షల మంది రైతులకు రైతు భరోసా ఇచ్చామని.. కోటి 49 లక్షల ఎకరాలకు రైతు భరోసా ఇచ్చామని అన్నారు. తెలంగాణ చరిత్ర అంతా రైతులదే అని... భూమి చుట్టూనే మన పోరాటాలు, జీవితాలు ముడిపడ్డాయని అన్నారు. రైతులను ఆదుకున్న చరిత్ర కాంగ్రెస్‌దే అని అన్నారు. మా ప్రజాప్రభుత్వంలో మొదటి ప్రాధాన్యం రైతులే.. రైతుల తర్వాత మహిళలు, యువత మా ప్రాధాన్యం. రైతులకు రుణమాఫీ చేస్తామని ఎన్నికల్లో మాట ఇచ్చాం.. నిలబెట్టుకున్నాం అని సిఎం అన్నారు.. 25 లక్షల మందికిపైగా రైతులకు రుణమాఫీ చేశాం. గత ముఖ్యమంత్రి వరి వేసుకుంటే ఉరి వేసుకోవడమే



అని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక సన్నవడ్లు పండిస్తే బోనస్ ఇస్తామని చెప్పాం. అంతేకాకుండా 48 గంట్లలో డబ్బు జమ చేశాం. దేశంలోనే అత్యధికంగా వరి పండిరచే రాష్ట్రమని గర్వంగా చెప్పుకొంటున్నాం. గత ముఖ్యమంత్రి కేసీఆర్ రూ.8 లక్షల కోట్లకుపైగా అప్పులు మా నెత్తిన పెట్టి వెళ్లారు. రూ.లక్ష కోట్లతో కాళేశ్వరం కట్టడం.. కూలడం కూడా జరిగిపోయింది. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుకు ఫామ్‌హౌస్‌లు ఎలా వచ్చాయి? రాష్ట్రం దివాలా తీస్తే వాళ్లంతా ఎలా సంపన్నులయ్యారు? కేసీఆర్ వేలాది ప్రభుత్వ పాఠశాలలు మూత వేయించారు. కానీ, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత 60 వేల ఉద్యోగాలు ఇచ్చాం. గ్రామాల్లో అమ్మ ఆదర్శ పాఠశాలలు తీసుకువచ్చామని అన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ ధ్యేయం. మహిళలు సౌర విద్యుత్ ఉత్పత్తి చేసేలా చర్యలు చేపట్టాం. వెయ్యి మెగావాట్ల సౌర విద్యుత్‌పై విద్యుత్‌శాఖతో ఒప్పందం కుదుర్చుకున్నాం. మహిళలకు రూ.21వేల కోట్ల వడ్డీలేని రుణాలు ఇచ్చి ఆదుకున్నాం. మహిళా స్వయం సహాయక సంఘాల ఉత్పత్తుల విక్రయానికి చర్యలు చేపట్టాం.

శిల్పారామంలో 150 షాపుల ఏర్పాటుకు స్థలం కేటాయించాం. వెయ్యి బస్సులు కొని ఆర్టీసీకి మహిళలు అద్దెకు ఇచ్చేలా చర్యలు చేపట్టాం. 8 వేల ఐకేపీ కేంద్రాలను మహిళల చేతుల్లో పెట్టాం. పాఠశాలల్లో ఆహార పదార్థాల సరఫరా బాధ్యతను స్వయం సహాయక సంఘాలకు అప్పగించాం. పదేళ్ల భారాస పాలన, 18 నెలల కాంగ్రెస్ పాలనపై చర్చ పెట్టాలి.' అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. గోదావరి జలాలపై అసెంబ్లీలో చర్చకు కేసీఆర్ సిద్ధమా ?అని సీఎం రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు. ' అసెంబ్లీలో చర్చ కోసం స్పీకర్‌కు లేఖ రాయాలి. కేసీఆర్ చెప్పిన తేదీన అసెంబ్లీలో చర్చ చేపట్టే బాధ్యతను మంత్రి శ్రీధర్‌బాబు తీసుకుంటారు. ఆధారాలు, సంతకాలతో అసెంబ్లీలో చర్చకు వస్తా. కేసీఆర్ సిద్ధమా? ఒకరోజు గోదావరి జలాలు, రెండో రోజు కృష్ణా జలాలపై చర్చిద్దాం. గతంలో సంతకాలు చేసిన కాగితాలు అసెంబ్లీ ముందు ఉంచుతా' అని సీఎం అన్నారు.రైతునేస్తం సభలో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి కేసీఆర్ ను ఉద్దేశించి ఘాటైన వ్యాఖ్యలు చేశారు. 2016లో బానకచర్లకు పునాది వేసింది కేసీఆరే అని.. రోజమ్మ రొయ్యల పులుసు తిని నీళ్లు అప్పగించింది ఎవరని సీఎం రేవంత్ ప్రశ్నించారు. ఎవరు తెలంగాణకు ద్రోహం చేశారో చర్చిద్దామంటూ సవాల్ విసిరారు. మా పాలన, మీ పాలనపై కేసీఆర్ చర్చకు సిద్ధమా అని ప్రశ్నించారు. కృష్ణానదిపై కేసీఆర్ ఏ ఒక్క ప్రాజెక్టు కూడా పూర్తి చేయలేదని అన్నారు. గోదావరి బనకచర్ల విషయంలో తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని.. చంద్రబాబుతో ఉండేవాడిని అయితే.. అక్కడే ఉండేవాడినని అన్నారు. బనకచర్లపై అసెంబ్లీలో చర్చకు కేసీఆర్ సిద్ధమా అని ప్రశ్నించారు సీఎం రేవంత్. అసెంబ్లీకి వచ్చి చర్చలో పాల్గొనే దమ్ము కేసీఆర్ కు ఉందా అని అన్నారు. నీటి హక్కుల విషయంలో తెలంగాణకు మరణశాసనం రాసిందే కేసీఆర్ అని మండిపడ్డారు.











# రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలు ప్రారంభం

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ జిల్లా కేంద్రం స్థానిక ధర్మకంచలోని జెడ్పీహెచ్ఎస్ బాయ్స్ హైస్కూల్లో సోషల్ వాయిస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను డీఈవో భోజన్న ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ సోషల్ వాయిస్ ఫౌండేషన్ డ్రస్స్ డ్రగ్స్ కి వ్యతిరేకంగా నిర్వహిస్తున్న ఈ వాలీబాల్ టోర్నమెంట్ విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలను విద్యార్థులకు వివరించారు. సోషల్ వాయిస్ ఫౌండేషన్ నిర్వహించిన వాలు బాల్ టోర్నమెంట్ మొదటి మ్యాచ్ డీఈఓ టీం, విద్యార్థుల టీంల మధ్యల జరగగా డీఈఓ టీం విజయం సాధించింది. కార్యక్రమంలో జిల్లా యువజన మరియు క్రీడల శాఖ అధికారి వెంకట్ రెడ్డి, సోషల్ వాయిస్ ఫౌండేషన్ అధ్యక్షులు మంగళంపల్లి రాజు, సభ్యులు కౌశిక్, గిట్ల చిన్న, నల్ల రాహుల్, ప్రవీణ్, ఆసర్ల సుభాష్, నరసింహ, వెంపటి అజయ్, చిటుకుల అశోక్, దేశ్ పాండే సంస్థ ప్రతినిధులు చిన్న రాజేందర్, విద్యాశాఖ ఎస్ఓ శ్రీనివాస్, జెడ్ పి హెచ్ ఎస్ అమ్మ ఆదర్శ కమిటీ అధ్యక్షురాలు తదితరులు పాల్గొన్నారు.






# వన మహోత్సవాన్ని విజయవంతం చేయాలి

- ప్రతి పట్టణంలో కనీసం 500 మందికి ఇందిరమ్మ ఇండ్లు
- ఆగస్టు 15 నాటికి భూ భారతి దరఖాస్తుల పరిష్కారం
- సీఎస్ రామ కృష్ణా రావు వీడియో కాన్ఫరెన్స్



**జనగామ, మన చౌరాస్తా :** ప్రజలను భాగస్వామ్యం చేస్తూ వన మహోత్సవం కార్యక్రమం విజయవంతం చేయాలని రాష్ట్ర ముఖ్య కార్యదర్శి కే. రామ కృష్ణా రావు అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుంచి ఆయన ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఆన్ లైన్ నుంచి అటవీ పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ హాజరయ్యారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్లు పింకేష్ కుమార్, రోహిత్ సింగ్‌తో కలిసి కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి పాల్గొన్నారు. వన మహోత్సవం కార్యక్రమం, ఇందిరమ్మ ఇండ్ల, ఎరువుల లభ్యత, ఆయిల్ పామ్ పంట విస్తరణ, సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు, భూ భారతి దరఖాస్తుల పరిష్కారం వంటి పలు అంశాల పై సీఎస్ సుదీర్ఘంగా చర్చించి పలు సూచనలు చేశారు. రాష్ట్ర ముఖ్య కార్యదర్శి కే.రామ కృష్ణా రావు మాట్లాడుతూ 2 లక్షల 30 వేల కు పైగా ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను లబ్ది దారులకు పంపిణీ చేశామని, లక్షకు పైగా ఇండ్ల నిర్మాణ పనులు గ్రౌండ్ అయ్యాయని అన్నారు. పెద్ద వర్షాలు కురవడానికి ముందే మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్, బేస్మెంట్ స్థాయి వరకు నిర్మాణం జరిగేలా చూడాలని సీఎస్ సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల కోసం ఉచితంగా ఇసుక సరఫరా చేస్తూ సీనరేజి చార్జీలను ప్రభుత్వం రద్దు చేసిందని అన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పెండింగ్ పనులు లబ్దిదారులు పూర్తి చేసుకునేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని అన్నారు. ప్రస్తుతం ఎంత మేరకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం జరిగిందో ఎంబీ రికార్డులను నమోదు చేసి లబ్ధిదారులకు ఇండ్లను కేటాయించాలని, ప్రభుత్వం మిగిలిన పనులు పూర్తి చేసేందుకు అవసరమైన నిధులు లబ్ధిదారుల ఖాతాలో జమ చేస్తుందని అన్నారు. పీఎం ఆవాస్ యోజన అర్బన్ 2.0 కింద మనకు లక్షా 13 వేల ఇండ్లను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిందని, ప్రతి పట్టణం నుంచి కనీసం 500 మంది నిరు పేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని కలెక్టర్లకు సీఎస్ సూచించారు.

వన మహోత్సవం కార్యక్రమం కింద ఇండ్లకు పంపిణీ చేసే మొక్కల పెంపకం సైతం పరిశీలించాలని, మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని సీఎస్ కలెక్టర్లకు సూచించారు. ప్రతి జిల్లా ప్రత్యేకమైన ప్రణాళికను సిద్ధం చేసుకుని వన మహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించాలని, నాటిన మొక్కల వివరాలను ఎప్పటికప్పుడు జియో కోఆర్డినేట్స్ తో ఆన్ లైన్ లో నమోదు చేయాలని అన్నారు.



ప్రతి జిల్లాలో ఎరువుల లభ్యత స్టాక్ పై రివ్యూ పెట్టాలని అన్నారు. జూలై వరకు అవసరమైన స్టాక్ ప్రస్తుతం అందుబాటులో ఉందని, సెప్టెంబర్ నాటికి అవసరమైన ఎరువుల స్టాక్ ప్రొక్యూర్ చేస్తున్నామని అన్నారు. ఎరువుల స్టాక్ ను ప్రత్యేక అధికారులను నియమించి ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అన్నారు.

లక్షా 25 వేల ఎకరాలలో ఆయిల్ పామ్ పంట సాగు ప్రస్తుత సంవత్సరం విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని అన్నారు. రైతులకు లాభసాటి పంట ఆయిల్ పామ్ పట్ల అవగాహన కల్పిస్తూ పంట విస్తరణకు చర్యలు తీసుకోవాలని అన్నారు.

భూ భారతి చట్టం రెవెన్యూ సదస్సుల ద్వారా దాదాపు 8 లక్షల 27 వేల దరఖాస్తులు వచ్చాయని, వీటిని సాదా బైనామా, ఆర్ఓఆర్ సమస్యలు, పట్టాలో కరెక్షన్స్ వంటి వివిధ సమస్యల పై దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఆగస్టు 15 నాటికి ఈ దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సీఎస్ ఆదేశించారు.

డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా వంటి సీజనల్ వ్యాధులను నియంత్రించేందుకు జిల్లాల్లో పటిష్ట చర్యలు తీసుకోవాలని, కలెక్టర్ లు ప్రత్యేక శ్రద్ధ వహించి సీజనల్ వ్యాధుల నియంత్రణ పై అవగాహన కల్పన, పర్యవేక్షణ వంటి పలు కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. వీసీ అనంతరం కలెక్టర్ సంబంధిత అధికారులతో రివ్యూ చేస్తూ.. వనమహోత్సవ కార్యక్రమం జిల్లా లో విజయవంతం గా జరగడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ప్రతీ మండలంలో కనీసం రెండు ప్రదేశాలను గుర్తించి అక్కడ ప్రజాప్రతినిధులు, అధికారులతో మొక్కలు నాటించాలన్నారు. ఈ వీసీలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, ఆర్డీవోలు, వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.



## పల్లాను పరామర్శించిన నాయకులు

**బచ్చన్నపేట, మన చౌరాస్తా:** ఇటీవల ప్రమాదవశాత్తు గాయపడి చికిత్స పొంది విశ్రాంతి తీసుకుంటుండగా జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డిని బచ్చన్నపేటకు చెందిన పలువురు నాయకులు మంగళవారం పరామర్శించారు. మాజీ సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు గంగం సతీష్‌రెడ్డి, మాజీ ఎంపీపీ బావన్న కృష్ణంరాజు, మాజీ ఎంపీటీసీల ఫోరం దూడల కనకయ్య, మాజీ సర్పంచులు ఎంపీటీసీలు కోనేటి స్వామి, పర్వతం మధు, ప్రసాద్, నాగిరెడ్డి వెంకట్ రెడ్డి, పంజాల శ్రీధర్ గౌడ్, మహమ్మద్ ఆజాం, వినయ్ కుమార్, మీసా శ్రీనివాస్, సిద్ది రాములు, గుర్రాల నర్సి రెడ్డి, ఐలయ్య షబ్బీర్, కోడూరు శివకుమార్, గూడ సిద్దారెడ్డి, జూకంటి కిష్టయ్య, కవ్వం కరుణాకర్ రెడ్డి హైదరాబాద్‌లోని ఆయన నివాసానికి వెళ్లి వారిని పరామర్శించారు.



## హామీల అమలులో కాంగ్రెస్ విఫలం : రమణారెడ్డి

**బచ్చన్నపేట, మన చౌరాస్తా :** కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓట్ల కోసమే రైతు భరోసా పథకాన్ని పునఃప్రారంభించిందని రైతు బంధు సమితి మాజీ జిల్లా అధ్యక్షుడు ఇర్రి రమణారెడ్డి ఆరోపించారు. మంగళవారం బచ్చన్నపేట మండల కేంద్రంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాటు వరుసగా రైతుబంధు పథకం ద్వారా రైతులకు సహాయం అందించగా, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రెండేళ్లుగా ఈ పథకాన్ని నిర్వీర్యం చేసిందని విమర్శించారు. ఇప్పుడు ఒక్కసారి రైతు భరోసా అందించి సంబురాలు చేసుకోవడం విడ్డూరమన్నారు. స్థానిక ఎన్నికల్లో ఓట్లు రాబట్టేందుకే ఈ చర్య తీసుకున్నారని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక చెరువులు ఎండిపోయి కుంటలుగా మారాయని, బీఆర్ఎస్ హయాంలో గోదావరి జలాలతో చెరువులు సమృద్ధిగా ఉండేవని రమణారెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వ విధానాలను ప్రజలు గమనిస్తున్నారని, రాబోయే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెప్పనున్నారని హెచ్చరించారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చంద్రారెడ్డి, మాజీ ఎంపీటీసీ కర్నాల వేణుగోపాల్, నాయకులు బాలచందర్, బోడిగం గోవర్ధన్ రెడ్డి, కాపర్తి హరిప్రసాద్, గుర్రాల అనిల్ రెడ్డి, పందిపెల్లి సిద్ధిరాం రెడ్డి, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## మహిళా మోర్చా ఆధ్వర్యంలో

# మొక్కల పంపిణీ



**జనగామ, మన చౌరాస్తా** : 'ఒక మొక్క.. అమ్మ పేరు మీద' కార్యక్రమంలో భాగంగా మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు కత్తుల లక్ష్మి ఆధ్వర్యంలో వీవర్స్ కాలనీలో 11వ వార్డులో మొక్కలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి బీజేపీ జిల్లా అధ్యక్షులు సౌడ రమేష్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు మొక్కలు పెంచాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ ప్రధాన కార్యదర్శి శివరాజ్ యాదవ్, పట్టణ అధ్యక్షుడు బొమ్మకంటి అనిల్, మాజీ పట్టణ అధ్యక్షుడు పవన్ శర్మ, జిల్లా నాయకులు దేవర ఎల్లయ్య, జిల్లా, పట్టణ ప్రధాన కార్యదర్శులు తోకల హరీష్, పెద్దోజు జగదీష్, ఉపాధ్యక్షులు బింగి రమేష్, సోమనబోయిన సంపత్, ఆకుల క్రాంతి, నవీన్ రెడ్డి, చందు, రఫ్తార్ సింగ్ వార్డు మహిళలు పాల్గొన్నారు.





# దేవాదుల పనులు త్వరగా పూర్తి కావాలి

## స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**జనగామ, మన చౌరాస్తా :**

దేవాదుల ఎత్తిపోతల పనులను తర్వగా పూర్తి చేయాలని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. దేవాదుల ఎత్తిపోతల పనుల ప్రగతి పైన జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్‌తో కలిసి స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మంగళవారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్‌లో సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కడియం మాట్లాడుతూ దేవాదుల ఎత్తిపోతల పనులు వేగవంతం కావాలన్నారు. అశ్వరావుపేట కుడి ప్రధాన కాలువ పనులను నెల రోజులలో పూర్తి చేయాలన్నారు. మొత్తం 20 డిస్ట్రిబ్యూటరీస్ తో పాటు సబ్ మైనర్స్ లో కూడా సిల్ట్ రిమూవల్, జంగల్ క్లియర్ చేయాలని.. అశ్వరావుపల్లి కుడి కాలువ చాలా ప్రధానమైనదని ఆశించిన స్థాయిలో పనులు జరగాలన్నారు. ఒక్క 20 ఎల్ కిందనే 14వేల ఆయకట్టు ఉందని.. నెల రోజుల్లో 1ఎల్ నుండి 20 ఎల్ వరకు అన్ని పనులు పూర్తి చేయాలన్నారు. ఘనపూర్ నుంచి నవాబ్ పేట ప్రధాన కాలువలో 10 డిస్ట్రిబ్యూటరీస్ ఉన్నాయని, 1 ఎల్ ఉప్పుగల్, తిమ్మంపేట అలాగే 2 ఎల్ సముద్రాల, నారాయణపురం, సూరారం వరకు సిల్ట్ రిమూవల్ చేయాలన్నారు. సమ్మక్క - సారలమ్మ బ్యారేజ్ లో లిఫ్ట్ చేయడానికి సరిపోను నీటి లభ్యత ఉందని, పంపు హౌస్ ల మెయింటనెన్స్ ఎప్పటికప్పుడు సరిచేసుకోవాలన్నారు. డిమాండ్ కు ముందే పంపింగ్ లో ఎలాంటి సమస్యలు లేకుండా చూసుకోవాలన్నారు. ముందుగానే రిజర్వాయర్లు నింపి పెట్టుకోవాలన్నారు. ధర్మసాగర్ నుంచి నీటి డిస్ట్రిబ్యూషన్ పై ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. ధర్మసాగర్, ఘనపూర్, నవాబ్ పేట, అశ్వరావుపల్లి రిజర్వాయర్లను 20 రోజుల్లో నింపాలని.. ధర్మసాగర్ నార్త్, సౌత్ కెనాల్స్ ద్వారా చివరి ఆయకట్టు వరకు నీరు చేరాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ స్పెషల్ డ్రైవ్ గా చేపట్టిన తక్కువ ఖర్చుతో ఇంకుడు గుంతల నిర్మాణానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించి.. అట్టి ఇంకుడు గుంత నిర్మాణాన్ని కలెక్టరెట్ నుంచి కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రారభించారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ సీఈ అశోక్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాంబాబు, ఘన్‌పూర్ మార్కెట్ చైర్‌పర్సన్ లావణ్య, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, ఆర్డీవోలు, ఇరిగేషన్ శాఖ అధికారులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.





# సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

**బచ్చనపేట, మన చౌరాస్తా :** రైతు భరోసా సంబురాల్లో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి బచ్చన్నపేటలో క్షీరాభిషేకం చేశారు. అనంతరం సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ శారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు, నియోజకవర్గ నాయకులు, మండల నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# పెంబర్తిలో 'ఎర్ర మందారాలు'

**జనగామ, మన చౌరాస్తా :** మణికంఠ ఫిలింస్ బ్యానర్‌పై నిర్మిస్తున్న ప్రొడక్షన్ నెంబర్ వన్ చిత్రం ఎర్ర మందారాలు సినిమా షూటింగ్ జనగామ జిల్లా పెంబర్తి గ్రామంలో మంగళవారం ప్రారంభమైంది. ప్రముఖ వైద్యులు కల్నల్ డాక్టర్ మాచర్ల బిక్షపతి, లయన్ మాజీ గవర్నర్ కన్న పరశురాములు పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మాత, దర్శకులు వై.జగన్, యామంకి యుగేందర్ మాట్లాడుతూ ఎర్ర మందారాలు మూవీ సామాజిక నేపథ్యంలో నిర్మిస్తున్నామని, జనగామ జిల్లాలోని పలు ప్రాంతాల్లో సినిమా షూటింగ్ చేస్తున్నామని, అలాగే జనగామ లోకల్ లోని నటులకు అవకాశం కల్పిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో మూల రవి, సిద్ది లింగం, వీరయ్య, భాస్కర్, సుదీర్, వై. సుదన్, శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు. ఈ చిత్రంలో నటీనటులు రాజ్ కుమార్, సాహితి, శ్రీనివాస్, జి.కృష్ణ, అయిలా సోమనర్సింహచారి, గౌలుసుల ఎల్లయ్య, దిగోజు శ్రీలక్ష్మి, అంబాల శ్రీనివాస్ గౌడ్ నటిస్తున్నారు. డీవోపీ పాండు, నిర్మాత వై.జగన్, కథ, మాటలు, దర్శకత్వం యామంకి యుగేందర్.

# 26, 27న కేవీపీఎస్ శిక్షణ తరగతులు

**జనగామ, మన చౌరాస్తా :** ఈనెల జూన్ 26, 27వ తేదీల్లో కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) జనగామ జిల్లా స్థాయి సామాజిక శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్టు ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు పల్లెర్ల లలిత తెలిపారు. జనగామ జిల్లా లింగాలఘణపురం మండలం వనపర్తి గ్రామం శ్రీలక్ష్మి గార్డెన్ లో జరిగే ఈ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా నాయకులు ఎలేంద్ర, మౌనిక, సునీత, లక్ష్మీ, ప్రశాంతి, షాలిని, ఉపేంద్ర, కవిత, యాకమ్మ, లావణ్య, భానుప్రియ, జ్యోతి పాల్గొన్నారు.